గుంటూరు ఎంపీ మిస్సింగ్ !

- 2014 నుంచి ఇంత వరకు కనపడని ఎంపీ గల్లా జయదేవ్
- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల నిరసన
- అభివృద్ధి చేయకపోగా అడ్డుపడితే సహించేది లేదంటూ టీడీపీ కార్పొరేటర్లపై మండిపాటు
- హోర్డింగ్స్ నిర్వహణలో భారీగా అవకతవకలు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



ఎంపీ మిస్సింగ్ అంటూ నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: ఎంపీ గల్లా జయదేవ్ పత్తా లేకపోవడంపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగింది. ఎంపీ మిస్సింగ్ అంటూ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎంపీ గల్లా జయదేవ్ గుంటూరు అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని పట్టుబట్టారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం గురువారం రాత్రి వరకు కొనసాగింది. మొత్తం 359 అంశాలకు సంబంధించి కౌన్సిల్ సమావేశం ఉదయం 10.41 నిమిషాలకు ప్రారంభమైంది. ఇందులో సభ్యుల ప్రశ్నలు 90 కాగా, మిగిలినవి వారి ప్రతిపాదనలుగా ఉన్నాయి. గుంటూరు నగరంలోని అన్ని డివిజన్ల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు ప్రారంభ ఉపన్యాసంలో స్పష్టం చేశారు.

గుంటూరు ఎంపీగారు ఎక్కడ ?

నగరంలో అరండల్‌పేట ఫ్లైఓవర్, నగరంలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలకు ఎంపీలకు ఎమ్మెల్యే ముస్తఫా లేఖ రాశారని, దానిని కౌన్సిల్ తీర్మానం చేసి పంపాలని డెప్యూటీ మేయర్‌మ వనమా బాలవజ్రబాబు ప్రతిపాదించారు. దానికి టీడీపీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ కలగజేసుకుని... 'మా ఎంపీ అల్రెడీ లేఖ రాశారని, ఇప్పుడు దీనిపై తీర్మానం చేయాల్సిన అవసరం లేద'ని ప్రస్తావించడంతో డెప్యూటీ మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి ఎంపీ గల్లా జయదేవ్ గుంటూరు అభివృద్ధికి ఏం చేశారో ? చెప్పాలని ప్రశ్నించారు. దీనికి తోడుగా వైఎస్సార్ కార్పొరేటర్లు కూడా గళం కలిపారు. ఎంపీగా గెలిచిన నాటి నుంచి గుంటూరులో కనిపించని ఎంపీ గల్లా జయదేవ్ అని మండిపడ్డారు. ఎంపీ మిస్సింగ్ అంటూ నిరసన తెలియజేశారు. అభివృద్ధి చేయకపోగా, చేస్తున్న వారిని అడ్డుకుంటే సహించేదని డెప్యూటీ మేయర్ స్పష్టం చేశారు.

ఈ ఆటోల నిర్వహణ అస్తవ్యస్తం

నగరంలో 207 వార్డు సచివాలయాలకు 220 ఈ ఆటోలు వచ్చాయని వాటిలో సగం కూడా రన్నింగ్‌లో లేవని డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు అడిగిన ప్రశ్నకు ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. ఆటోల నిర్వహణలో కొన్ని సమస్యలు రావడంతో వాటిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. వారు వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపుతామని తెలియజేశారని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులు చొరవ తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. 60 ఏళ్లు పైబడిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని సూచించారు.

గత కౌన్సిల్‌లో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఏదీ ?

గత కౌన్సిల్‌లో అడిగిన పలు ప్రశ్నలకు ఇంత వరకు సమాధానం లేదంటూ కార్పొరేటర్లు అజయ్, రమ్య, అంజలిలతో పాటు ఇతర కార్పొరేటర్లు అధికారులపై మండిపడ్డారు. ఇంతవరకూ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న ఉద్యోగుల వివరాలు ఇవ్వలేదంటూ ధ్వజమెత్తారు. సబ్ కమిటీల ఏర్పాటు, ఎన్టీఆర్ స్టేడియంలో తమకు శాశ్వత సభ్యత్వం గురించి ప్రశ్నించారు. అతీగతి లేదని మండిపడ్డారు. మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత సభ్యత్వం అంశాన్ని చట్టం, బైలాస్ ప్రకారం చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం పదవిలో ఉన్న సభ్యులకు సభ్యత్వం ఉంటుందని, శాశ్వత సభ్యత్వం కావాలంటే కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై కొందరు సభ్యులు మాట్లాడుతూ గతంలో శాశ్వత సభ్యత్వం ఇచ్చారని...ఇప్పుడు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి: ఎమ్మెల్యే గిరి

నగరపాలక సంస్థ పరిధిలో టెండర్ దక్కించుకుని పనులు నిర్వహించకుండా కాలయాపన చేసే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, అవసరం అయితే వారిని భవిష్యత్తులో ఏ టెండర్‌లో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కోరారు.

హోర్డింగ్స్‌ను పట్టించుకోని పట్టణ ప్రణాళిక అధికారులు

హోర్డింగ్స్ నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని పలు కౌన్సిల్ సమావేశంలో చర్చించినప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారుల్లో చలనం లేదని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి మండిపడ్డారు. నగరంలో 1450 హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్లు వేశామని చెప్పిన అధికారులు, ఇంకా 153 అనధికార హోర్డింగ్స్‌లు ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరంలో 600కిపైగా అనధికార హోర్డింగ్స్ ఉన్నాయని, లక్షల్లో బకాయిలు ఉన్నప్పటికి పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోవడం లేదంటూ వెంకటరెడ్డి మండిపడ్డారు.

కోర్టు కేసుల్ని పరిష్కరించాలి

కోర్టు కేసుల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల సమస్యను పరిష్కరించి రిజర్వేషన్లు ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు కోరారు. షాపు లీజులు అయిపోయినప్పటికి అధికారులు వాటిని స్వాధీనం చేసుకోవడం విఫలం చెందుతున్నారని ఆరోపించారు. కోర్టు కేసుల్లో ఉన్న షాపుల సమస్యను పరిష్కరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని కార్పొరేటర్ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు.

మెరుగుపడుతున్న కానిస్టేబుల్ ఆరోగ్యం



నగరంపాలెం: దేవస్థానంలో దొంగతనానికి పాల్పడిన దుండుగల్ని పట్టుకునే ప్రయత్నంలో గాయాలై చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి క్రమేణా మెరుగుపడుతోంది. ఈనెల 5న తెనాలి వైకుంఠపురం దేవస్థానంలో దొంగల్ని పట్టుకునే క్రమంలో ఒకడు తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్ బాబును నెట్టడంతో పైనుంచి కిందపడి గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గుంటూరు రేంజ్ అధికారులతో మాట్లాడారు. కానిస్టేబుల్ ధైర్యసాహసాల్ని ప్రశంసిస్తూ, మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. దీంతో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ అత్యవసర చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.50 వేలను గుంటూరు జిల్లా పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి తక్షణ సాయంగా అందజేశారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా కానిస్టేబుల్‌ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఇక గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పలుమార్లు ఆస్పత్రికి వచ్చారు. గురువారం మరలా ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌తో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించడం వల్లే త్వరగా కోలుకున్నానని కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులు ఎస్పీకి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఆసుపత్రి వైద్యుల్ని ఎస్పీ అభినందించారు. ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎస్పీ వెంట గుంటూరు పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, సీఐ బి.నరసింహారావు, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు ఉన్నారు.

క్లుప్తంగా

మెప్మా సీఎంఎం సస్పెన్షన్

నెహ్రూనగర్: గుంటూరు రూరల్ మండలం చౌడవరం పరిధిలోని సీఆర్ నగర్‌లో డ్వాక్రా గ్రూపుల పేరుతో ఓ ఫేక్ ఆర్పీ(రిసోర్స్ పర్సన్) లోన్లు ఇప్పించిన ఘటనలో ఆ ప్రాంత సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) పి. శ్యామలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారని పీడీ పి. వెంకటనారాయణ తెలిపారు. ప్రతిసారి కమీషన్లు తీసుకోవడంతో పాటు లోను రికవరీ చేయకుండా ఫేక్ ఆర్పీ నగదును వాడుకున్నారని ఆరోపిస్తూ సదరు కాలనీ వాసులు సోమవారం కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. బ్యాంకు నుంచి నోటీసులు కూడా వచ్చాయని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మెప్మా మిషన్ డైరెక్టర్ సీఎంఎంను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో గురువారం ఓపీ ప్రధాన ద్వారం వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ల్యాబ్‌కు తాళాలుపై ఆగ్రహం

ఆస్పత్రిలో 24 గంటల ల్యాబ్‌ను సూపరింటెండెంట్ తనిఖీ చేశారు. ల్యాబ్‌కు తాళాలు వేసి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ తప్పనిసరిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ల్యాబ్‌ను తెరచి ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెదకాకాని: చికిత్స నిమిత్తం చేరిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం చోటు చేసుకుంది. గత నెల జూన్ 30న తండ్రి పేరు యలమందరాజు, వయస్సు 70, ఊరు నంబూరు అని చెప్పి గమిడి శ్రీను అనే వృద్ధుడు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. ఆ తరువాత పరిస్థితి విషమించి మరణించాడు. మృతుడు చెప్పిన అడ్రస్‌లో పెదకాకాని మండలం, నంబూరుగా నమోదై ఉంది. పోలీసు విచారణలో ఆ గ్రామంలో ఆ పేరుతో ఎవరూ లేరని తెలిసింది. మృతుని ఆచూకీ తెలిసిన వారు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని గురువారం సీఐ బండారు సురేష్‌బాబు కోరారు.

ఉర్దూ విద్యార్థులకు ఉజ్వల భవిత

- పాఠశాలలకు క్రమం తప్పకుండా పాఠ్య పుస్తకాల సరఫరా
- పాఠ్యాంశాలు ఉర్దూతో పాటు ఆంగ్ల మాధ్యమంలోనూ ముద్రణ
- రెండు భాషల్లోనూ ప్రావీణ్యం పెంచుకుంటున్న విద్యార్థులు



డ్యూయల్ లాంగ్వేజ్ విధానంలో ముద్రించిన ఉర్దూ పాఠ్య పుస్తకాలు (ఫైల్)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో	
ఉర్దూ పాఠశాలలు	: 224
చదువుతున్న విద్యార్థులు	:12వేలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉర్దూ మీడియం విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలతో చదువులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలతో పాఠశాలలకు రెగ్యులర్‌గా హాజరవుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో పాఠశాలలు తెరిచిన తరువాత నెలల తరబడి పాఠ్య పుస్తకాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని పూర్తిగా మార్చివేసింది. గత నాలుగేళ్లుగా ప్రతి ఏటా పుస్తకాల్ని సక్రమంగా పంపిణీ చేస్తోంది. పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థుల చేతుల్లోకి పుస్తకాలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియాలలో చదువుతున్న విద్యార్థులతో సమానంగా ఉర్దూ మీడియం విద్యార్థులకు మండలాల వారీగా పక్కాగా ఇండెంట్ తీసుకుని, నాణ్యమైన మెటీరియల్‌తో పాఠ్య పుస్తకాల్ని ముద్రించి ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలకు అవసరమైన పుస్తకాలను పూర్తిస్థాయిలో పంపిణీ చేసింది.

డ్యూయల్ లాంగ్వేజ్ విధానం అమలు

ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్న పాఠ్య పుస్తకాల్ని డ్యూయల్ లాంగ్వేజ్ విధానంలోకి ప్రభుత్వం మార్చింది. ఉర్దూతో పాటు ఆంగ్ల మాధ్యమంలోనూ పాఠ్యాంశాల్ని రూపకల్పన చేసింది. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ద్వారా ఒకే పాఠ్య పుస్తకంలో ఒక వైపు ఆంగ్ల మాధ్యమం, మరోవైపు ఉర్దూ మాధ్యమంలో పాఠ్యాంశాల్ని ముద్రించింది. తద్వారా ముస్లిం విద్యార్థులు ఒకేసారి తమ మాతృభాష ఉర్దూతో పాటు ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాల్ని చదువుకుని రెండు భాషల్లోనూ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 224 పాఠశాలలు

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 224 ఉర్దూ పాఠశాలల్లో 12వేల మంది మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 181 ప్రాథమిక పాఠశాలల పరిధిలో 6,000, 38 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5,000, ఐదు ఉన్నత పాఠశాలల్లో 1,000 చొప్పున విద్యార్థులున్నారు.

గతంలో ఉర్దూ పాఠ్య పుస్తకాల కొరత తీవ్రం



ఉర్దూ మీడియంలో చదువుతున్న విద్యార్థులకు గతంలో పాఠ్య పుస్తకాల కొరత తీవ్రంగా ఉండేది. పాఠశాలలు తెరిచిన తరువాత పుస్తకాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితుల్లో ఉండేది. గత మూడేళ్లుగా ప్రభుత్వం మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తూ ఉర్దూ పాఠ్య పుస్తకాల ముద్రణపై దృష్టి సారించింది. ఉర్దూ విద్యకు ఇస్తున్న ప్రోత్సాహంతో పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి.

– షేక్ మొహ్మద్ ఖాసిం, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి

చలపతి ఫార్మసీలో సర్ రామ్‌నాథ్ చోప్రా జయంతి



సర్ రామ్‌నాథ్ చోప్రా జయంతి వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: భారతీయ ఔషధ నిపుణుడు, పరిశోధకుడు, వైద్యరంగానికి గణనీయమైన కృషిచేసిన సర్ రామ్‌నాథ్ చోప్రాను ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫార్మాకాలజీగా పిలుస్తారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో సర్ రామ్‌నాథ్ చోప్రా జన్మదిన వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయ మొక్కలు, పదార్థాల ఔషధ లక్షణాలపై సమగ్ర సమాచారాన్ని అందిస్తూ మెటీరియా మెడికా ఆఫ్ ఇండియన్ డ్రగ్స్ అనే పుస్తకాన్ని రచించారన్నారు. ఈ పుస్తకం ఆరోగ్య సంరక్షకు, అభ్యాసకులకు, ఔషధ శాస్త్రవేత్తలకు ఎంతో ముఖ్యమైన వనరుగా మారిందని తెలిపారు. పాముకాటుపై చోప్రా చేసిన పరిశోధన, విషం విరుగుడుకు చికిత్స పద్ధతుల్ని మెరుగు పరచడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. సమాజాభివృద్ధికి ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.భానుప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపాలెంలో సీసీ డ్రైన్లకు శంకుస్థాపన



సీసీ డ్రైన్లకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో గురువారం రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ డ్రైన్లు, శ్మశానవాటిక ప్రహరీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి బోర్లు, పవర్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రజల ఇంటిముందుకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని తెలిపారు. ప్రజలు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యకర్తలు కూడా సైనికుల్లా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రజుమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి తదితరులున్నారు.

తాళికట్టు శుభవేళ.. మెడలో కల్యాణమాల

- పెళ్లి సందడి మొదలు
- శుభలగ్నాల జోరు
- కల్యాణ మండపాలకు గిరాకీ
- అర్చకులు బిజీబిజీ
- ఊపందుకున్న వ్యాపారాలు
- డిసెంబరు వరకూ మోగనున్న బ్యాండ్ బాజా



అధునాతన సెట్టింగులతో వివాహ వేదిక(ఫైల్)

సుముహూర్తాలు ఇవే..

ఆగస్టు	: 19,20,22,24,26,29,30,31
సెప్టెంబరు	: 1,2,3,6,7,8

పాత గుంటూరు: ఆషాఢం.. అధిక శ్రావణ మాసాలు వెళ్లిపోయాయి..శ్రావణమాసం వచ్చేసింది. వస్తూవస్తూ సుముహూర్తాల్ని వెంటబెట్టుకొచ్చింది. రెండు నెలలు తర్వాత జిల్లాలో పెళ్లి సందడి మొదలైంది. డిసెంబరు వరకు ఈ సందడి కొనసాగనుంది. ఈ నెల 19 నుంచి శుభగడియలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే చాలామంది ఇళ్లలో పెళ్లి సందడి నెలకొంది. వరుస శుభకార్యాలపై అన్ని రంగాల వారు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం వచ్చే శుభ ఘడియలతో ఊరట చెందుతున్నారు. ముద్రణ రంగం, కల్యాణ మండపాలు, అలంకరణ, పూల వ్యాపారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ముందస్తుగా ఆర్డర్లు తీసుకుంటున్నారు.

అధునాతన సెట్టింగులతో వేదికలు సిద్ధం

సుముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలు కళ్లు చెదిరే సెట్టింగులతో సిద్ధమయ్యాయి. లక్షల రూపాయల్లో అద్దె పలుకుతున్నా, కల్యాణమండపాల్లో పెళ్లిళ్లు చేస్తే ఆ తీరే వేరని తల్లిదండ్రులు భావిస్తున్నారు. స్తోమతకు తగ్గట్టు ఏర్పాట్లు చేసుకుంటున్నా రు. మండపాల నిర్వాహకులు కూడా రూ. 25 వేల నుంచి రూ. 2 లక్షల వరకు చార్జి చేస్తున్నారు.

కల్యాణ మండపాలకు క్యూ

వివాహాలకు జిల్లాలోని అన్ని కల్యాణ మండపాలు సిద్ధమయ్యాయి. ఒక్కో మండపం అద్దె రూ. 50 వేల నుంచి రూ. 5లక్షల వరకూ ఉంది. విద్యుత్‌కాంతులు, అధునాతన సెట్టింగులతో కలిపి నిర్వాహకులు అద్దె వసూలు చేస్తున్నారు.

డ్రోన్ ఫొటోగ్రఫీ ప్రత్యేకత

నేడు పెళ్లిళ్లలో డ్రోన్ ఫొటోగ్రఫీకి నగరంలో ఆదరణ పెరిగింది. గగనతలం నుంచి అత్యంత క్వాలిటీతో ఫొటోలు, వీడియోలు తీయడం డ్రోన్ ఫొటోగ్రఫీ విశిష్టత. మ్యారేజ్, రిసెప్షన్, సత్యనారాయణ వ్రతం, ఫొటోషూట్‌తో కలిపి ఒక్కో కార్యక్రమానికి రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షలు వరకు తీసుకుంటున్నారు.

బాజాభజంత్రీలకు గిరాకీ

బాజా భజంత్రీలు లేనిదే పెళ్లిళ్లు జరగవు. మంగళ వాయిద్యాలకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. వధూవరుల్ని సిద్ధం చేయడం నుంచి పెళ్లయి మళ్లీ వారిని ఇంటికి తీసుకొచ్చేవరకూ వాయిద్యాల అవసరం ఉంటుంది. జిల్లాలోని బ్యాండ్ మేళం గ్రూపులు పెళ్లికి రూ. 25 వేల నుంచి రూ. 50 వరకూ తీసుకుంటున్నారు.

సంగీత విభావరుల సందడి

నేడు పెళ్లిళ్లలో సంగీత విభావరుల సందడి పెరిగింది. దీనికి రూ.25 వేల నుంచి రూ. 5లక్షల వరకూ కళాకారులు తీసుకుంటున్నారు. గుంటూరుకు చెందిన కళాకారులు దూరప్రాంతాలకు వెళ్లి కూడా సంగీత విభావరి నిర్వహిస్తుంటారు.

రకరకాల విందు ఏర్పాట్లు

పెళ్లిలో విందు ఏర్పాట్లు ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. క్యాటరింగ్ నిర్వాహకులు ఒక్కొక్క ప్లేటు భోజం రూ. 150 నుంచి రూ. 1000 వరకూ వసూలు చేస్తున్నారు.

కల్యాణ వేదికకు ముందుగానే అడ్వాన్సులు



ఈ నెల 19 నుంచి ముహూర్తాలు ఉన్నాయి. గత రెండు నెలల నుంచి ఫంక్షన్ హాళ్లలో చిన్న చిన్న కార్యక్రమాలు తప్పా పెళ్లిళ్లు జరగలేదు. ప్రస్తుతం వచ్చే నెలలో కూడా ఆరు ముహూర్తాలు ఉండటంతో ముందస్తుగానే బుక్ చేసుకున్నారు. ఆదాయం కొంత ఆశాజనకంగా ఉంది.

– కుర్రా పున్నారావు, ఫంక్షన్ హాలు యజమాని

అధిక సంఖ్యలో వివాహాలు



శ్రావణమాసం రావడంతో పెళ్లి సుముహూర్తాలు వచ్చాయి. ఈ నెలలో బలమైన ముహూర్తాలు అత్యధికంగా ఉన్నాయి. డిసెంబరు వరకూ శుభకార్యాలకు అనుకూలమైన మంచి ముహూర్తాలు ఉన్నాయి. వచ్చే నెల ఎనిమిదో తేదీ తర్వాత ముహూర్తాలు లేవు. మరలా అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసంలో మంచి ముహూర్తాలు అన్నాయి. దీంతో అధిక సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది.

–విశ్వేశ్వరశర్మ, ఆర్చకులు

కళాకారులకు మంచి తరుణం



శ్రావణమాసం ప్రారంభం కావడంతో వివాహ వేడుకలు సిద్ధమయ్యాయి. ఆ వేదికలపై సంగీతానికి ప్రత్యేక స్థానాన్ని కూడా కల్పిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్లి కచేరీలు నిర్వహిస్తున్నాం, ఒక్కో ప్రోగ్రాంకు 25 నుంచి 30 మంది వరకూ వెళతాం. వరుస వివాహాలతో కళాకారులకు ఉపాధి లభిస్తుంది.

– కాసుల కృష్ణంరాజు, సంగీత కళాకారుడు

స్పైప్రో సెక్యూరిటీస్‌తో 'చలపతి' ఎంఓయూ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తును కల్పించాలనేది తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్పైప్రో సెక్యూరిటీస్ సంస్థతో తమ కళాశాల ఎంఓయూను కుదుర్చుకుందన్నారు. ఒప్పందం ద్వారా విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీస్, ఎథికల్ హ్యాకింగ్ లాంటి టెక్నాలజీస్‌పై సాంకేతిక శిక్షణ పొంది ఉపాధిని పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. సంస్థ సీఈవో చైతన్యరాణి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఉపాధి కల్పించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం పాల్గొన్నారు.

నేడు భ్రమరాంబకు పసుపు కొమ్ములతో అలంకారం



భక్తులు సమర్పించిన పసుపు కొమ్ములు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం పూజలు ప్రారంభమయ్యాయి. భ్రమరాంబ అమ్మవారిని శుక్రవారం పసుపు కొమ్ములతో అలంకరించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నంబూరు ఐజేఎం నివాసితులు జి.కిశోర్ రెడ్డి, వాణి దంపతులు, చిలకలూరిపేటకు చెందిన శంకర్, మరొక భక్తుడు కలసి 400 కిలోలు పసుపు కొమ్ములు అమ్మవారి అలంకరణ నిమిత్తం సమర్పించారని పేర్కొన్నారు. శ్రావణమాసంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణల్లో భాగంగా చందనం, చీరలు, గాజుల అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. చివరి శుక్రవారం ముత్తయిదువులకు సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పసుపు కొమ్ముల అలంకరణలో ఉన్న భ్రమరాంబ అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని, పూజా కార్యక్రమాలలో పాల్గొన వలసినదిగా శ్రీనివాసరెడ్డి కోరారు.

తోటమ్మ తల్లి ఆదాయం రూ.1.72లక్షలు

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని తోటమ్మతల్లి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్, భక్తుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.1,72,720 వచ్చినట్లు ఆలయ మేనేజర్ ఆర్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గోపిశెట్టి వెంకటేశ్వరరావు, అర్చకుడు అమర్‌నాథ్ శర్మ, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



విద్యార్థి రామ్‌చరణ్

తుమ్మలపాలెం(ప్రత్తిపాడు): ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన సాలిమెట్టి రామ్‌చరణ్ (16) గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలోని లక్ష్య అకాడమీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత మూడు రోజులుగా రామ్‌చరణ్ కళ్ల కలకలతో బాధపడుతున్నాడు. దీంతో అకాడమీ నిర్వాహకులు విషయాన్ని బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ నెల 16వ తేదీన బాలుడిని తీసుకువెళ్లేందుకు వారి బంధువులు అకాడమీ వద్దకు వచ్చారు. అప్పటికే ఎవ్వరికీ చెప్పకుండా అకాడమీ నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో బాలుడి తల్లి సాలిమెట్టి సలోమి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.